# నిజాయితీ నీవింకా చావలేదు

తమిళ మూలం : ఆర్. ప్రభాకర్
తెనుగు : కె. మాలతి

దివ్య కాంతులు వెదజల్లే మణులమధ్య మట్టి బెడ్డలా, తళ తళ మెరిసే మనుష్యుల మధ్య, సిటీ బస్‌స్టాండ్‌లో నిలబడి ఉన్నా నేను. రెండు నెలలుగా మాసిన గెడ్డం, తైలసంస్కారంలేని జుట్టు, గుంటలు పడ్డ కళ్ళు, పదిరోజుల క్రితం ఉతిన చింకి చొక్కా, చిక్కిన శరీరంపై ఎరువు ప్యాంటులా వేలాడే పాత పాంటు, నా శరీరంలా చిక్కి శల్యమైపోయిన చెప్పులు, ఇదీ నేటి సమాజంలోని సగటు మనిషికి ప్రతిబింబంలాంటి నా స్వరూపం

నేను అతి సామాన్యుణ్ణి. నాకున్న ఆస్థి నా బీదరికమే వెలుతురు చొరని తాటాకు గుడిసెలో, జీవితానికి అర్థం పరమార్థం ప్రసాదించే వివాహ జీవితం సాగించటంతో మేము నీకు తోడంటూ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు మా సరసన చేరారు.

నాకున్న బీదరికపు ఆస్థితో, కూలిపనితో జాలీ జీవితం ఎలా గడపగలను? అనుక్షణం ఎన్నో సమస్యలతో, దినదినగండం నూరేళ్ళాయుషులా రోజులు గడుస్తున్నాయి. ఈ పరిస్థితి నుంచి దూరం కావాలంటే, ఒకే ఒక సమస్య తీరాలి. అదేమిటనుకుంటున్నారు? మరేమీ కాదు. అదే ఉదర సమస్య.

ఆ సమస్య తీరడంకోసం ఆలోచించి, ఆలోచించి, నేనొక తీర్మానానికొచ్చాను. జీవితంలో నేను మొట్ట మొదట చేయబోతున్న సాహస కార్యమది. ఈ సామాన్యుడు చేసే సాహస కార్యమేమిటా అనుకుంటున్నారు కదూ—? అదే-దొంగతనం చేయటం.

"దొంగతనం" అనే మాటనే ద్వేషించే మనస్తత్వం నాది. కాని అతనివద్ద ఉన్నది నావద్ద లేదు. నే నడిగితే అతనివ్వడు. అందుచేత అడక్కుండా దాన్ని స్వీకరించదలిచా. దానివల్ల అతని సంసారం మునిగిపోదు. మునిగిపోయిన నా సంసారం నిలబడుతుంది. దీన్లో తప్పేముంది?


నా ఆలోచనకు అంతరాయం కలిగిస్తూ రామ్‌జీనగర్ బస్ వచ్చి మా ముందాగింది. నలుగురితో నారాయణ అనుకుంటూ అందరితోపాటు తోసుకుంటూ బస్సెక్కాను బస్ కిక్కిరిసివుంది. ఒకరి నొకరు కౌగిలించుకున్నట్లు నిలబడ్డాం బస్‌లో.

"కాస్త ముందుకు జరగండి. ఫుట్‌బోర్డు మీద వేలాడుతున్నారు జనం." కండక్టరు వినయ పూర్వక వాక్యంతో ముందుకు జరిగాను.

నేను చేయబోయే తొలి సాహసకార్యం కోసం కళ్ళు చించుకొని పరిశీలించా. నా ముందు నిలబడిన ఖద్దరు లాల్చీ వ్యక్తి, సీట్లో కూర్చుని సీరియస్‌గా ఎవరో చదువుకుంటున్న పేపరును అంత రష్‌లోను మెడ ప్రక్కకు వంచి, కొంపలంటుకున్నట్లు మరీ చదవటంలో మునిగిపోయాడు. పొంగిన పూరీలా వున్న ఆయన జేబునుండి పర్సు కొంచెం తలపైకి పెట్టి నీకోసమే చూస్తున్నానన్నట్లు నావంక తొంగి చూస్తోంది.

ప్రక్క చేయబోతున్న పాపక్రియకి ముచ్చెమటలు పోసినా, ధైర్యం తెచ్చుకుని మెల్లగా రెండువేళ్ళతో కొంచెం కొంచెంగా పర్సుని పైకి తీశాను.

"అయినా ఖుట్టోని ఉరితీసి వుండకూడదండీ" అంటున్నాడాయన పేపరు చదువు



తూనే, కేపరుల వ్యక్తితో.

నమ్మయ్యా! విజయలక్ష్మి నన్ను వరించేసింది. ఆయన నే పర్సు కొట్టేసిన విషయం కనిపెట్టలేదు, అనుకుంటూ ప్యాంటు జేబులో జాగ్రత్తగా దాచాను పర్సుని.

ఐదు నిమిషాల్లో బస్‌స్టాప్‌లో ఆగింది బస్. కంగారుగా దిగిపోయాను. నీ పని నీవు నిర్వహించావుగా. మరి నా పని నేను నిర్వహించాలి అన్నట్టు తుర్రుమంది బస్. హాయిగా నిట్టూర్చాను.

కాని "ఒరేయ్ నీవు చేసింది తప్పు" అంటూ నా మనసు నన్ను వేధిస్తోంది.

"పళ్లే పోరా!" అని వేగంగా నడిచి దగ్గర్లోని హోటల్లో కూరుని పర్సు విప్పి చూసి నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. ఇరవై వందనోట్లు, పైన చిల్లర నోట్లు నా కష్టాలు గట్టెక్కినట్లనిపించి, కడుపునిండా తృప్తిగా తిని బయట పడ్డాను.

మొదటి వేటలోనే నాకింత అదృష్టమా అనుకుంటూ కళ్ళ మూసుకుని ఒకటి లుదెరా.

ఎదురుగా పంపాహోటగులు ఎత్తైన సినిమా బొమ్మ ఆకర్షణీయంగా నవ్వుతోంది. అవును సినిమా చూసి ఎన్ని రోజులయిందో. ఈరోజు దాన్ని, కిల్లిన్ని తీసుకెళ్ళాలి. ముందు టికెట్స్ రిజర్వ్ చేద్దామనిపించి థియేటర్ పేరు చూసా. "క్షేమంగా వెళ్ళి లాభంగా రండి" నా అంటుంది. ఆ థియేటర్ దగ్గర్లో వుంకటంతో నడక ప్రారంభించా.

మళ్ళీ నా మనస్సు హీన స్వరంతో ఒరేయ్ నీవు చేసింది తప్పు, తప్పు అంటూనే ఉంది.

తప్పొ ఒప్పొ చేసాను. ఇక విచారించటం అనవసరం. దేశంలో బుద్ధిమంతులెవరసలు? ఎంత మంది లంచాలు తీసుకోవటం లేదు? సమాజంలో ఎన్ని అవినీతులు బహిరంగంగా జరగటం లేదు? నేనేమీ పెద్ద బ్యాంకును కొల్లగొట్టలేదే? ఏదో నా అవసరం కొద్ది కొంచెం తీసాను! న్యాయవాదిలా నా మనసుకు చెబుతూ నడుస్తున్న

నన్నొక గుంపు ఆకర్షించింది. రోడ్డు ప్రక్కన పది పదిహేను మంది గుంపుగా నిలబడి తొంగి చూస్తున్నారు. ఓ కృశించిన శల్యమైన అస్థిపంజరంలా వున్న ముసలి స్త్రీ స్పృహ లేకుండా పడివుంది.

"పాపం సార్! నడిచి వస్తూనే హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయింది.

"అయ్యో పాపం లేవండి! ఆకలి మైకం"

"జరగండి సార్..! గాలి రానివ్వండి..'

చుట్టూ చేరిన జనం తలా ఓలా మాట్లాడుతూనే ఉన్నారు. ఎవ్వరూ సహాయం చేసే పాపాన పోలేదు. నేను సహించలేకపోయాను. నేనెందుకు సహించలేకపోయానో తెలుసా? ఆమె నాదగ్గరి బంధువు గనుక. దిక్కూ మొక్కూ లేనట్లు పడివున్న ఆమె నా బంధువేమిటీ అనుకుంటున్నారు కదూ. ఆమె నాలాంటి పేదరాలు. అందుకే ఆమె నాకు బంధువు నేనామెకు సహాయం చేసి తీరాలి.


సోడా తెచ్చి ముఖంమీద నీళ్ళు చల్లండి స్పృహ వస్తుంది అన్నారొకాయన ఇంత మంచి సలహా ఇచ్చిందెవరా అని తిరిగి చూసాను. ఆయన అంతలోనే పదడుగులు వెళ్ళిపోయాడు. పాపమాయన సోడా తేవడానికి వెళ్ళాడ్కనుకన్నా. ఆయన పరిగెత్తుకుంటూ వెళ్ళి సిటీ బస్సెక్కాడు, ఎలక్షన్లో కల్పించి తరువాత తుదాకీ దెబ్బకి కూడా కనిపించని రాజకీయ నాయకుడిలా.

మూడొంతుల జనం వెళ్ళిపోయారు, ఆకలిని చాటిచెప్పే దీన వదనంతో ఆ నా బంధువు అలానే పడివుంది.

దగ్గరో వున్న కాఫీ హోటల్‌కి వెళ్ళి ఇడ్లీ, కాఫీ, మంచినీళ్లు తీసుకొని పరిగెత్తుకు వచ్చా.

"జాగ్రత్తగా తీసుకెళ్ళండి, పెళ్ళివారి నడక నడుస్తున్నారేమిటీ?" అంటున్నాడొక బుర్రమీసాల సామి. ఏదో ఆయన డబ్బిచ్చి తెప్పిస్తున్నట్లు.

నీళ్ళామె ముఖం మీద చల్లటంతో నెమ్మదిగా కళ్లు తెరచి కళ్ళతోనే కృతజ్ఞ




తలు తెప్పింది. ఇడ్లీ తినిపిస్తే తిని, కాఫీ త్రాగి కాస్త తెప్పరిల్లింది.

అపుడు నేను తప్ప ఇంకెవరూ లేరక్కడ.

"ఏమ్మా! తోడు లేకుండా ఎందుకొచ్చావు ఇంటినుంచి?" అన్నాను.

అది విని ఏదో విట్టు వేస్తే నవ్వినట్లు నవ్వి అంది "ఇల్లెక్కడిది నాయనా నాకు. ఈ ప్లాటుఫారమే నా ఇల్లు"

"మరి..నిన్ను పోషించవాని కెవరు.?" అన్నాను.

"ఉన్నాడు నాయనా. పదిహేనేళ్ళ కొడుకున్నాడు. కూలికని వెళుతుంటాడు రెండు రోజులుగా కుండపోతగా పెద్ద వర్షం వల్ల వాడికి పని లేదు. ఈరోజు వర్షం తగ్గినా పని దొరకలేదు బూట్ పాలిష్ చేసైనా నాలుగు డబ్బులు తెస్తానని వెళ్ళాడు. రెండు రోజులనుండి ఏమీ తినక పోవటంతో ఈ పాడు శరీరం నిలబడలేక పోయింది నీవెవరోగాని వెయ్యేళ్ళు సుఖంగా బ్రతుకు నాయనా" అంటూ రెండు చేతులూ జోడించింది.

తరువాత అక్కడ నిలబడి ఏం చెయ్యాలో అర్థంకాక "తప్పమ్మా! చిన్నవాడ్ని నాకు నువ్వు దణ్ణాలు పెట్టకూడదు' అని వారిస్తూ అక్కడనుండి బయలుదేరా.

కొంతదూరం వెళ్ళాక తరువాత వెనుకనుండి ఎవరో 'సార్! సార్' అంటున్నట్లనిపించింది ఈ సామాన్యుడ్ని 'సార్' అని పిలిచేవాళ్ళెవరా అని తిరిగి చూసాను.

... వాడి చేతిలో బూట్ పాలిష్ బాక్స్, కళ్ళలో దీనత్వం పొంగి పొరలుతోంది.

"ఏమిటీ బాబు" అన్నా.

"సార్! మీ చెప్పులకి పాలిష్ చేస్తాన్ సార్"

వెంటకుప్పమీదకు వెళ్ళటానికి సిద్ధంగా వున్న నా చెప్పులకి పాలిష్? అవసరం లేదనిపించి వద్దన్నా.

"సార్! దయచేసి పాలిష్ చేయించుకోండి మా అమ్మ ఆకలితో అల్లాడి పోతోంది. రెండురోజులనుంచి ఇంతవరకు పైసాకూడా దొరకలేక సార్" దీన వదనంతో దీనంగా ఉన్నాయి వాడి మాటలు.

వెంటనే నాకర్థమయిపోయింది పిచ్చి ముసలి తల్లి ముద్దుబిడ్డడని. నాను

సూర్యకాంతికి మంచు కరిగినట్లు కరిగిపోయింది. ఈ చిన్న వయసులో ఇంత పెద్ద బాధ్యతా? రెండు రూపాయలు తీసి ఇస్తూ "వెళ్ళు వెళ్ళి మీ అమ్మకి భోజనం కొని పెట్టు" అన్నా.

"వద్దు సార్! చెప్పులకు పాలిష్ చేయించుకోండి. ఆ తరువాత తీసుకుంటాను."

"పర్వాలేదు. నేను కల్పై అరంగం వెళ్లాలి టైమ్ లేదు, ఇంద తీసుకో."

"లేదు సార్! అలా తీసుకుంటే అది భిక్ష. చెప్పులకు పాలిష్ చేసి తీసుకుంటాను. అది న్యాయం" అన్నాడు

వయసుకు మించిన వాడి మాటలు, నా హృదయాన్ని తాకాయి. నాచింకి చెప్పులకు పాలిష్ చెయ్యమన్నా. పాలిష్ చేసి ఇచ్చిన తర్వాతనే డబ్బులు తీసుకున్నాడు.

"అలా తీసుకుంటే అది భిక్ష. అలా తీసుకుంటే అది భిక్ష" ఆకుర్రాడి మాటలే నా చెవుల్లో మ్రోగుతున్నాయి. అతడెంతో ఉన్నతంగా ఎదిగిపోయాడ పించింది నాకు.

కాని నేను చేసినపని ...

ఇది ఆలోచిస్తూ థియేటర్ చేరుకునేసరికి "హౌస్‌ఫుల్" బోర్డ్ నాకంట పడింది.

నిరుత్సాహంతో వెనతిరిగి వస్తుంటే, జన సమూహంలో పరిచయమైన ముఖమొకటి కన్పించింది. అవునా? కాదా? అని పరిశీలనగా మరీ చూసాను.

నా అనుమానం నిజమే అయింది వీడు ....వీడు ..వాడే. నావద్ద చెప్పులకు పాలిష్ చేసి రెండు రూపాయలు తీసుకున్న కుర్రవాడే వీడు వా కంగారులో వాడేదో వెతుక్కుంటున్నాడు.

నాకు కళ్లు తిరిగినంత పనయింది. ఎంత తేలిగ్గా నేను మోసగింపబడ్డాను. కొన్ని నిముషాల క్రితం వరకు అతడ్ని గురించి.... ఛీ! ఛ తడేమిటి? . వాడ్ని గురించి ఎంత ఉన్నతంగా ఊహిమంకున్నాను. వెధవ అమ్మ ఆకలిని ఎరగా చూపించి డబ్బులు సంపాదించి సినిమాకి వచ్చాడే....వెధవ రాస్కెల్ ....

మనోవేగంతో పోటీపడుతూ నాకాళ్ళు నడుస్తుంటే ఐదు నిమిషాల్లో ఆకుర్రాడి తల్లి వున్న చోటికి చేరుకున్నా.

"ప్రొద్దున వెళ్ళిన నాకొడుకింకా రాలేదు బాబూ" అంటూ నన్ను చూడగానే ఏడ్పు మొదలెట్టిందామె.

"నీవిక్కడ బాధ పడుతున్నావు. వాడక్కడ సంపాదించిన డబ్బుతో కలాసాగా సినిమా చూస్తున్నాడు" కోపాన్ని ఆపుకోలేక కస్సుమన్నాను.

"లేదు నాయనా! నా బాబు మేలిమి బంగారము సుమా!" తల్లికి తన కొడుకుపై ఉన్న నమ్మకంతో అంటోందామె.

అదే సమయంలో వెనుకనుండి "సార్! సార్!' అన పిలుపు వినిపించింది. వెనక్కి తిరిగి చూసా. రొప్పుకుంటూ పరుగెత్తుకు వచ్చాడా కుర్రాడు. నాకు సంశయం కలిగింది. 'సినిమాకు వెళ్ళినవాడు. వీడెందుకిప్పుడు ఇక్కడికి వచ్చాడని''.

"సార్ .... మీ కోసం సినిమాహాలు దగ్గరంతా వెతికానుసార్. మీరు కనపడలేదు...." ఊపిరి పీల్చుకోడానికన్నట్లు మధ్యలో ఆగాడు.


నన్ను వెతికాడా? ఎందుకు? మనసులో అనుమానం.

"ఎందుకు వెతికావు?" అన్నా.

"మీరు పర్సు పడేసుకుని వెళ్లారు సార్. ఇదుగోండి" అంటూ ఆ పర్సు అందించాడు.

అప్పుడే కాల్చిన గరిటెతో వాత పెట్టినట్లు, చుర్రుమంది నాకు. వాడికి రెండు రూపాయలిచ్చి జేబులో పెట్టుకునే సమయంలో పర్స్ జారిపోయుంటుంది నేనా విషయం గమనించనేలేదు.

"సార్! చాలా భయమేసిందండీ! పర్సు విప్పి చూస్తే .. అమ్మో .. ఎంత డబ్బో! మీ రేపనిమీద తెచ్చారో? మీరు కల్పై అరంగం థియేటర్‌కి వెళ్తానని చెప్పారుగా. అందుకే పరిగెత్తుకెళ్ళి అక్కడ చూసాను. మీరు కన్పించలేదు. ఇంకా నయం ఇక్క




హైశా మీరు కన్పించారు. లేకపోతే మీ రెంత కంగారుపడేవారో కదా....?"

వాడి మాటలు నాపాలిట కొరడాదెబ్బ లయినట్లనిపించింది. ఆ పదిహేనేళ్ళ కుర్రాడికి ఉన్న నిజాయితీ నిండిన మనస్సు, ముప్ఫై అయిదేళ్ళ నాకు లేదే? సిగ్గుతో కుంచించుకుపోయింది మనసు.

వాడు కావాలనుకుంటే ఆ డబ్బు మొత్తం తీసుకొని ఉండవచ్చు. వాడి నిజాయితీ.....వాడి మాటలు.....వాడి చేతలు నన్ను చిత్రవధ చేస్తున్నాయి.

"తమ్ముడూ...." అంటూ వాణ్ని గాఢంగా కౌగిలించుకున్నా. నా కళ్ళనుంచి అశ్రుబిందువులు రాలాయి,

o o o

మరో అరగంటలో కాళ్ళు పాలక్కారై పోలీసు స్టేషన్‌లో అడుగు పెట్టాయి. అక్కడ ఆ ఖద్దరు లాల్చీ ఆసామి దీన వదనంతో కూర్చుని ఉన్నాడు.

నేను పర్సు యస్. ఐ. గారికి అందించి "అయ్యా! నాకిది బస్‌స్టాప్‌లో దొరికింది" అన్నా.

ఆ పెద్దమనిషి కళ్ళు పర్సుమీదపడ్డాయి. ఆయన ముఖం కలువపూవులా వికసించింది. నా చేతులు పట్టుకుని ఉద్వేగంతో తడబడుతున్న మాటలతో "బాబూ....! మీరు చల్లగా పదికాలాలు బ్రతకాలి బాబూ. ఇది నా కంపెనీ-డబ్బు. ఒకరి వద్ద నుండి వసూలు చేసి తెస్తున్నా. ఇది దొరక్కపోతే, నా ఉద్యోగం పోతుంది నా సంసారం వీధిన పడుతుంది"

ఏం మాట్లాడాలో అర్థంకాక మౌనంగా బయటకువచ్చా.

భగవాన్....! నా భార్యా పిల్లలమీద ఒట్టు వేసి చెప్తున్నా ఇంకెప్పుడూ నేను దొంగతనం చేయను. కృషికి లభించే డబ్బు తక్కువే కావచ్చు, కాని అదిచ్చే తృప్తి, ఆనందమే నాకు పదివేలు మనస్ఫూర్తిగా ప్రమాణం చేసి. నడక సాగించా.

"మన దేశంలో నీతి నశించి పోయింది. నిజాయితీ చనిపోయింది" దూరంగా ఒక రాజకీయ నాయకుడు, బహిరంగసభలో వీరావేశంతో ప్రసంగిస్తున్నాడు

"లేదు....లేదు ...నిజాయితీ చావలేదు. ఇంకా కొంతమంది వద్ద సజీవంగా నవ్వుతూనే వుంది" అని ఆయన వైపు తిరిగి, గొంతు చించుకుని అరిచాను.

అది ఆయన చెవుల్లో పడలేదు-పడదు కూడా. కాని మీ చెవుల్లో పడింది కదూ.... అదే పదివేలు! ★